I

సాక్షి సూర్యాపేట

శనివారం । 26 । ఏప్రిల్ । 2025



లోక రక్షణార్థమే ఏసు జననం

లోక రక్షణార్థమే ఏసుక్రీస్తు జన్మించారని విజయవాడ మేత్రాసన పీఠాధిపతి జోసెఫ్ రాజారావు అన్నారు.

- IIలో



జైలును పరిశుభ్రంగా ఉంచాలి

జిల్లా జైలును పరిశుభ్రంగా ఉంచాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్, జస్టిస్ షమీమ్ అక్తర్ సూచించారు.

- IIలో

గరిష్టం/కనిష్టం
40° /25°

వాతావరణం

ఉదయం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారదకు సన్మానం



జిల్లా ప్రధాన జడ్జి లక్ష్మీశారదతో డీఎల్‌ఎస్‌ఏ ఎక్స్‌అఫీషియో సభ్యులు

చివ్వెంల: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీ శారదను శుక్రవారం సూర్యాపేటలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్‌ఎస్‌ఏ) ఎక్స్ అఫీషియో సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు మొక్కను అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ఎక్స్ అఫీషియో సభ్యులు గుంటూరు మధు, అల్లంనేని వెంకటేశ్వర్‌రావు, నల్లపాటి మమత తదితరుల పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

భానుపురి (సూర్యాపేట): ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో కోదాడ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్)పై నిర్వహించినసమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ప్రతిరోజూ విద్యార్థులకు తెలుగు రాయడం, చదవడం నేర్పించడానికి సమయం కేటాయిస్తూ నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. అర్థంకాని విద్యార్థులకు వీడియోల ద్వారా తెలుగు, హిందీ భాషలు నేర్పించాలన్నారు. సమావేశంలో డీఈఓ అశోక్, క్వాలిటీ కోఆర్డినేటర్ జనార్దన్, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రవణ్‌కుమార్, ఇంక్లూజివ్ కోఆర్డినేటర్ రాంబాబు, జనరల్ ఈక్వలిటీ కోఆర్డినేటర్ పూలమ్మ పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే ఏనాటికైనా శిక్ష తప్పదు



అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్‌ను సన్మానిస్తున్న ఎస్పీ

సూర్యాపేటటౌన్ : చట్టాన్ని ఉల్లంఘిస్తూ నేరాలకు పాల్పడితే ఏనాటికైనా శిక్ష తప్పదని ఎస్పీ కె.నరసింహ అన్నారు. కన్న కూతురిని నరబలి ఇవ్వగా తల్లికి ఉరిశిక్ష విధించిన కేసులో బాధితుల తరపున వాదనలు వినిపించిన జిల్లా మొదటి అదనపు సెషన్స్ న్యాయస్థానం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవిందర్‌ను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు పోలీస్ లైజన్ అధికారి హెడ్ కానిస్టేబుల్ గంపల శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



సమావేశంలో పాల్గొన్న జగదీశ్వర్ తదితరులు

సూర్యాపేట అర్బన్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆల్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని నిర్వహించి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఎస్ విధానాన్ని రద్దు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్నా ఇంతవరకు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో ఆ జేఏసీ జిల్లా చైర్మన్ షేక్ జానీమియా, అడిషనల్ జనరల్ సెక్రెటరీ తంగెళ్ల జితేందర్‌రెడ్డి, ఇంజనీర్ల జేఏసీ చైర్మన్ పాండు నాయక్, డిప్యూటీ సెక్రెటరీ జనరల్ దున్న శ్యామ్, కో చైర్మన్లు వీరన్న, డిప్యూటీ సెక్రటరీ జనరల్ లక్కపాక ప్రవీణ్, జహంగీర్, జాయింట్ సెక్రెటరీ డి.స్వప్న, సీటీఓ విభాగం చైర్మన్ రవీందర్ బాబు, నాయిని ఆకాష్ వర్మ, ఎం.సైదులు, వెంకన్న, సతీష్, రవి, మల్సూర్ పాల్గొన్నారు.

మండే కాలం.. జర భద్రం!

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- 42 డిగ్రీలకుపైగా నమోదవుతున్న గరిష్ట ఉష్ణోగ్రతలు
- మే నెలలో 46 డిగ్రీలకు చేరే అవకాశం
- ఇప్పటికే అల్ట్రా వైలెట్ (యూవీ) 10 శాతం నమోదు
- ఈ పరిస్థితుల్లో జనంతోపాటు.. పశుపక్షాదుల రక్షణ తప్పనిసరి
- వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను కాపాడుకోవాలి

నల్లగొండ : వాతావరణ మార్పుల కారణంగా ఎండలు మండుతున్నాయి. ఓజోన్ పొర దెబ్బతిని సూర్య కిరణాలు నేరుగా భూమిని తాకుతున్నాయి. దీంతో ఎండ వేడిమి పెరిగి జనం అల్లాడుతున్నారు. డీ హైడ్రేషన్‌కు గురవుతున్నారు. దీనికి తోడు ఏసీల వాడకం పెరగడంతో గాలిలో తేమ శాతం తగ్గిపోతోంది. ఈ కారణంగా జిల్లాలో అల్ట్రా వైలెట్ (యూవీ) పది శాతం నమోదవుతోంది. ఆకాశంలో తెల్లటి మేఘాలు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో జనం జాగ్రతలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి మంగ్యా నాయక్ సూచిస్తున్నారు.



భానుడు భగ్గుమంటున్నాడు. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలవుతోంది. రాత్రి 10 గంటలకు కూడా వాతావరణం చల్లబడడం లేదు. ఎండల దాటికి ప్రజలు ఇళ్లనుంచి బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు చేరుకున్నాయి. వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు కురిస్తే ఎండలు కాస్త తగ్గే అవకాశం ఉంది. లేదంటే మే నెలలో 46 డిగ్రీలకు మించి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండడంతోపాటు చెట్లను, జీవరాశులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

పెంపుడు జంతువులు - జాగ్రత్తలు..

కోదాడ, రామగిరి(నల్లగొండ), నకిరేకల్ : వేసవిలో జంతు ప్రేమికులు వారి పెంపుడు జంతువుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అధిక ఉష్ణోగ్రతలు వాటి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంటుంది.

- ఎప్పటికప్పుడు శుభ్రమైన, చల్లటి నీటిని అందుబాటులో ఉంచాలి.
- పెంపుడు జంతువు ఉండే ప్రాంతం చల్లదనంగా ఉండేలా చూసుకోవాలి. గాలి వేగంగా వెళ్తున్న స్థలాన్ని ఎంచుకోవాలి.
- మధ్యాహ్నం సమయంలో నేలపై నడవనివ్వకూడదు.



- ఊపిరాడకపోవడం, అలసట, అధిక నిద్ర లాంటి లక్షణాలను గ్రహించాలి. వాటి శరీరానికి తగినంత గాలితీసుకునే అవకాశం ఇవ్వాలి.
- పెంపుడు జంతువులు ఉండే ప్రాంతాన్ని పూర్తిగా మూసివేయకుండా.. గాలి మార్పిడి ఉండేలా చూసుకోవాలి.
- తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని ఇవ్వాలి.
- వేసవి ఒత్తిడిని తగ్గించడానికి వాటికి టానిక్‌లను తాగించాలి.
- పక్షుల సంరక్షణకు ఇంటి గోడలు, వరండాలు, డాబాలపై చిన్నచిన్న చిప్పల్లో నీళ్లు పోసి ఉంచాలి.
- వీటి పక్కనే చిరుధాన్యపు గింజలు పోసి ఉంచాలి.
- రోడ్ల వెంట ఉండే చెట్ల మొదళ్ల వద్ద కూడా నీటి వసతులు కల్పించాలి.



సేవ్ బర్డ్స్ క్యాంపెయిన్‌లో పాల్గొనాలి

వేసవిలో పక్షులు దాహార్తి తీర్చడానికి ప్రజలు తమ ఇళ్లలో వరండాలు, బాల్కానీల్లో నీటి చిప్పలు, కృతిమ గూళ్లను, ఫీడర్లను ఏర్పాటు చేయాలని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు తమ ఇళ్లలో వరండాలు, బాల్కనీల్లో పిట్టగోడలపై పిల్లల చేత నీటి కుప్పలను ఏర్పాటు చేయిస్తే బాగుంటుంది. ధాన్యపు చిప్పలను కూడా ఏర్పాటు చేసి పక్షుల మనుగడకు దోహదపడాలి. సేవ్ బర్డ్స్ క్యాంపెయిన్‌లో అందరూ భాగస్వాములు కావాలి.

- కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, నకిరేకల్

వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి



ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల వృద్ధులు జాగ్రత్తగా ఉండడం మంచిది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్నం వేళ వృద్ధులు బయటికి వెళ్లొద్దు. చెమటలు బాగా వచ్చి, కళ్లు తిరిగితే సంబంధిత డాక్టర్‌ను కలిసి ఈసీజీ తీయించుకోవాలి. ఎండలకు రక్తపోటు పెరుగుతుంది. విరోచనాలు, వాంతులు ఎక్కువగా అయితే డాక్టర్‌ను సంప్రదించాలి. ఎలక్ట్రోలైట్స్ పౌడర్‌ను తీసుకోవాలి. డయాబెటిస్, హైపర్‌టెన్షన్ పేషెంట్లు జాగ్రత్తగా మత్తు, శీతల పానీయాలను ఎక్కువగా తీసుకోవద్దు. నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, జ్యూస్‌లు బాగా తాగాలి.

- రమణ, జనరల్ ఫిజీషియన్, సూర్యాపేట

ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకంలో మెళకువలు తప్పనిసరి..

సూర్యాపేటటౌన్ : సాధారణంగా టెంపరేచర్ ఎక్కువగా ఉన్నప్పుడు తొందరగా కూల్ అవ్వడానికి ఏసీని తక్కువ టెంపరేచర్‌లో ఆన్ చేస్తాం. కానీ 15 నుంచి 20 నిమిషాల ముందు 23 డిగ్రీల వద్ద ఏసీని ఆన్ చేసి పెట్టుకోవాలి. ఏసీ, ఫ్యాన్‌ను ఒకేసారి ఆన్ చేయకూడదు. 15 రోజులకు ఒకసారి ఎయిర్ ఫిల్టర్‌ను క్లీన్ చేసుకోవాలి.

- వాటర్ ప్యూరిఫైడ్‌లో ఫిల్టర్ చేసిన వాటర్‌ను ఉదయం 6గంటల నుంచి 10 గంటల మధ్యలో వాడుకోవాలి. ఆ తరువాత ఇంట్లో ప్యూరిఫైడ్‌కు ఇచ్చిన నల్లా కనెక్షన్‌లో నల్లాను ఆఫ్ చేసుకోవాలి. మధ్యాహ్నం వేళ నీళ్లు వేడెక్కడం వల్ల ఆ నీరు ఫిల్టర్‌లో పోయినప్పుడు ఆర్‌వో గానీ మినరల్స్ ఫెయిల్ అయ్యే అవకాశం ఉంటుంది. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 10 గంటలలోపు ప్యూరిఫైడ్‌ను వాడుకోవాలి.

ఎండలో బయటికి వెళ్లొద్దు



ఎండలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో జనం జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండ బాగా ఉన్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ బయటికి వెళ్లొద్దు. ఒక వేళ వెళ్లాల్సి వస్తే.. గొడుగు, టోపీ, రుమాలు ధరించాలి. రోజూ ఐదు లీటర్ల నీటిని తాగాలి. బయటి ఆహారం, మాంసాహారానికి దూరంగా ఉండాలి. ఎండల్లో తిరిగితే కళ్లు తిరిగి పడిపోయి పక్షవాతం, గుండె జబ్బులకు గురయ్యే అవకాశం ఉంది. డయాబెటిక్ రోగులు జాగ్రత్తగా ఉండాలి.

- డాక్టర్ మాత్రు, డీసీహెచ్‌ఎస్, నల్లగొండ

చిన్న పిల్లల రక్షణ ప్రధానం



వేసవి కాలంలో చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలో తిరిగితే పిల్లలు డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది. మజ్జిగ, పుచ్చకాయ, కొబ్బరి నీరు, నిమ్మరసం, కీర దోస, పుదీన నీరు తాగించాలి. తెల్లని వదులైన కాటన్ దుస్తులు వేయాలి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటికి పంపవద్దు. తలనొప్పి, తలతిరగడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, అధిక చెమట, అధిక దాహం కలిగితే వెంటనే సమీప ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాలి.

- డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, నల్లగొండ

కిచెన్, టెర్రస్ గార్డెన్‌లను కాపాడుకోండి ఇలా..

కోదాడ, భువనగిరిటౌన్ : చాలా మందికి గార్డెనింగ్ అంటే ఇష్టం. మొక్కల పెంపకంలో చాలా కేర్ తీసుకుంటారు. అయితే, వేసవిలో మొక్కలను కాపాడుకోవడం కష్టంతో కూడుకున్న పని. ఈ చిట్కాలు పాటిస్తే ఎండబారి నుంచి కాపాడుకోవచ్చంటున్నారు.. ఉద్యానవన అధికారులు.

- రోజూ సాయంత్రం ఆరు గంటల తరువాతే మొక్కలకు నీరు పెట్టుకోవాలి.
- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత మొక్కలపై నేరుగా పడకుండా గ్రీన్‌మ్యాట్ పైకప్పుగా ఏర్పాటు చేసుకోవాలి.
- గ్రీన్‌మ్యాట్‌పై రెండు మూడు గంటలకు ఒకసారి నీటిని చల్లాలి.
- మొక్కలకు రసాయన ఎరువులను అందించవద్దు. మొక్కల పాదుల్లో తడి ఆరకుండా చూసుకోవాలి.
- కుండీల్లో మొక్కలు నాటితే తరచూ మట్టిని మార్చాలి. మట్టిలో ఆవు పేడ కలపాలి. మట్టి ఎక్కువ రోజులు తడిగా ఉండటానికి కుండీలో ఎండిన ఆకులను ఉంచాలి.
- మొక్కలకు వేప పిండిని ఎరువుగా ఉపయోగించవచ్చు.



కుండీల్లో పదును ఉండేలా చూస్తున్నా..

గతేడాది కంటే ఈ సంవత్సరం ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ఎండ వేడిమికి మొక్కలు ఎండిపోతున్నాయి. మొక్కల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకుంటున్నా. కుండీల్లో నాటిన మొక్కలకు ఎప్పుడు తడిగా ఉండేలా చూస్తున్నా. సూర్యరశ్మి తక్కువ సోకే ప్రాంతాల్లో మొక్కలను ఉంచుతున్నా. - దాత్రక్ పద్మ, భువనగిరి

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి



హుజూర్‌నగర్‌లో వాల్ పెయింటింగ్ రాస్తున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

హుజూర్‌నగర్ : వరంగల్‌లో ఈనెల 27న జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో వాల్ పెయింట్ వేసి నాయకులను, కార్యకర్తలను ఉత్సాహ పరిచయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ హాజరు కానున్న ఈ సభ కోసం తెలంగాణ ప్రజలు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారన్నారు. ఈ సభతో అధికార పార్టీ గుండెల్లో రైళ్లు పరిగెడతాయని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి అమర్ గౌడ్, నాయకులు పి.ఉపేందర్, డి.నరసింహారావు, ఆర్.రాము, నరసింహారావు, అంజి, చుక్కయ్య, నాగరాజు, కొరివీరయ్య దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శాస్త్రీయ అవగాహన అవసరం

సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయులకు శాస్త్రీయ అవగాహన అవసరమని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.రాములు అన్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సూర్యాపేట పట్టణంలో నిర్వహిస్తున్న ఉద్యమ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యూటీఎఫ్ కార్యకర్తలు సంఘ నిర్మాణాన్ని, పని పద్ధతులను మెరుగు పరుచుకోవాలన్నారు. శాస్త్రీయ ఆలోచన, నిబంధనావళి, పని పద్ధతులపై రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్ కుమార్ బోధించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కోశాధికారి జి.వెంకటయ్య, జిల్లా కార్యదర్శులు ఆర్.దామోదర్, ఎన్.నాగేశ్వర్ రావు, బి.ఆడమ్, వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి చట్టం.. రైతులకు వరం



మునగాలలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



నడిగూడెంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

మునగాల: భూ భారతి చట్టం రైతులకు వరం లాంటిదని.. ఈ చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం మునగాల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కోదాడ ఆర్డీఓ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన భూ భారతి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు రెవెన్యూ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. అదనపు కలెక్టర్ పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 279 రెవెన్యూ గ్రామాల్లో గ్రామపరిపాలన అధికారుల వ్యవస్థ త్వరలో అందుబాటులోకి రానున్నదన్నారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ చట్టం విధివిధానాలను సదస్సులో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శిరీష, కోదాడ ఏడీఏ డి.ఎల్లయ్య, ఏఓ బి.రాజు, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఐకేపీ ఏపీఎం నాగెల్లి నగేష్, కోదాడ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు, పీఏసీఎస్‌ల చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, చందా చంద్రయ్య, తొగరు సీతారాములు, వి.రామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే..

నడిగూడెం: భూసమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టం వస్తోందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలోని కొల్లు కోటయ్య మెమోరియల్ ఫంక్షన్ హాల్‌లో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్టుగా నాలుగు మండలాల్లో చేపట్టారని, ఏమైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి భూ భారతి పోర్టల్‌లో మార్పుల అనంతరం ఈ చట్టాన్ని జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి జిల్లా అటవీశాఖ అధికారి పి.సతీష్ కుమార్, కోదాడ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ వి.సరిత, ఎంపీడీఓ దాసరి సంజీవయ్య, ఏడీఏ యల్లయ్య, ఏఓ రాయపు దేవప్రసాద్, సహకార సంఘాల చైర్మన్‌లు కొల్లు రామారావు, గోసుల రాజేష్ పాల్గొన్నారు.

ఏడాదైనా 20శాతం పనులే..

సూర్యాపేట పట్టణంలో నత్తనడకన యూజీడీ నిర్మాణం

- రూ.316 కోట్లతో పనులకు శ్రీకారం
- మొదటి జోన్‌లో కొనసాగుతున్నా.. రెండో జోన్‌లో మొదలు కాలే..
- డిజైన్ రూపకల్పనలో జాప్యం.. బిల్లులు అందక ఆలస్యం

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. డిజైన్ సర్వే చేయడంలో జాప్యం.. కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు అందకపోవడం.. వెరసి రెండడుగులు ముందుకు నాలుగడుగులు వెనక్కి అన్న చందంగా పనులు సాగుతున్నాయి. పనులు ప్రారంభించి ఏడాది దాటినా 20శాతం మాత్రమే పూర్తయ్యాయి.

2024 మార్చిలో ప్రారంభించినా..

సూర్యాపేట పట్టణంలో సుమారు రూ.316కోట్ల అంచనా వ్యయంతో 290 కిలోమీటర్ల పొడవున అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేయడానికి ప్రణాళికలు రూపొందించారు. ఇంటి నుంచి మెయిన్‌పైప్‌లైన్‌కు ఎనిమిది ఈంచుల వ్యాసం గల పైపులు, మెయిన్‌లైన్ కోసం ఆయా ప్రాంతాల అవసరాలను బట్టి రెండు నుంచి మూడు ఈంచుల వ్యాసం గల పైపులు వేయాలని నిర్ణయించారు. యూజీడీ పనుల కోసం పట్టణాన్ని రెండు జోన్లుగా



సూర్యాపేటలోని బాలాజీ నగర్‌లో రోడ్డు మధ్య డ్రిల్లింగ్ మిషన్‌తో చేసిన రంధ్రాలు



బాలాజీనగర్‌లో పైపులు వేసిన తర్వాత సరిగా చదును చేయకుండా వదిలేసిన మట్టి

విభజించారు. పనులకు 2023లో శంకుస్థాపన చేయగా 2024 మార్చిలో ప్రారంభించారు.

మొదటి జోన్‌లో..

మొదటి జోన్‌లో భగత్‌సింగ్‌నగర్, జమ్మిగడ్డ, చింతలచెరువు, తిరుమలనగర్, చర్చికాంపౌండ్, అంబేద్కర్ నగర్, పాత ఎమ్మార్వో ఆఫీస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో పైపులు వేసి వీటిని జమ్మిగడ్డలోని మురుగునీటి శుద్ధి ప్లాంట్‌కు అనుసంధానం చేస్తారు. ఇక్కడ నీటిని శుద్ధి చేసిన తర్వాత పుల్లారెడ్డి చెరువులోకి తరలించాలని ప్రణాళిక రూపొందించారు. ఈ జోన్‌లో పనులు ప్రారంభమయ్యాయి. చర్చికాంపౌండ్, బాలాజీ నగర్, భగత్‌సింగ్‌నగర్, అంబేద్కర్‌నగర్‌లో మెయిన్ పైప్‌లైన్ వేసే పనులు పూర్తయ్యాయి. ఇళ్ల నుంచి మెయిన్ పైప్‌లైన్‌కు పైపులు వేయలేదు. మిగతా చోట్ల మెయిన్‌పైప్‌లైన్ వేసే పనులు సాగుతున్నాయి.

రెండో జోన్‌లో ఇలా..

రెండో జోన్ లో 9, 23, 24,25,29, 39, 40,41 42 వార్డుల్లో యూజీడీ పైపులు వేసి ఆ మురుగునీటిని నల్లచెరువు వద్ద నిర్మిస్తున్న మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌కు అనుసంధానం చేస్తారు. ఇక్కడ శుద్ధి చేసిన నీటిని నల్లచెరువులోకి తరలిస్తారు. కానీ ఈ జోన్‌లో పనులే మొదలు కాలేదు. ఇందిరమ్మ ఫేస్-1, ఫేస్2, ఫేస్-3, శ్రీనివాస కాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో మెయిన్ పైప్‌లైన్ వేయడానికి మార్కింగ్ వేసి వదిలేశారు.

బిల్లులు రాక..

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ డిజైన్ రూపకల్పనలో ఆలస్యం కారణంగా పనులు చేపట్టడంలో జాప్యం జరిగింది. దీనికి తోడు కాంట్రాక్టర్‌కు గతంలో సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు చేయడానికి ఆసక్తి చూపలేదు. దీంతో పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి.

సూర్యాపేట పట్టణంలో వార్డులు	48
నివాస గృహాలు	39,800
జనాభా	1.53 లక్షలు
యూజీడీ అంచనా వ్యయం	రూ.316 కోట్లు

ప్రజలకు తప్పని ఇబ్బందులు

బాలాజీ నగర్, శ్రీరాంనగర్, కాశీంపేట ప్రాంతాల్లో రోడ్డును తవ్వి మెయిన్‌పైప్స్ లైన్ వేసి పూడ్చారు కానీ రోడ్డును చదును చేయకపోవడంతో గుంతలుగుంతలుగా ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

దోమలు వృద్ధిచెందాయి



రోడ్ల పక్కనే మురుగు కాల్వలు ఉండడంతో దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధిచెందుతున్నాయి. యూజీడీ ఏర్పాటు చేయడం సంతోషకరం. కానీ నెలల తరబడి పనులు చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నాం.

- చిత్తలూరి నరేష్, శ్రీనివాస కాలనీ

నిర్దేశిత గడువులోగా పూర్తిచేస్తాం

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ఇప్పటికీ 20శాతం మేర పూర్తయ్యాయి. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేస్తాం. అన్ని వార్డుల్లో పైప్‌లైన్ వేసిన తర్వాత మురుగునీటి శుద్ధి ప్లాంట్‌కు అనుసంధానం చేస్తాం.

- నరేందర్, ఏఈ

పనులు త్వరగా పూర్తిచేయాలి

ఇందిరమ్మ ఫేస్-1 కాలనీలో ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టలేదు. రోడ్డు మధ్యలో డ్రిల్లింగ్ మిషన్లతో రంధ్రాలు చేసి వదిలేశారు. చీకట్లో ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉంది. పనులు త్వరగా పూర్తిచేయాలి.



- యాతాకుల రాజయ్య, ఇందిరమ్మ కాలనీ

క్లుప్తంగా

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

సూర్యాపేటటౌన్ : మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరికి సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ రెండు రోజుల జైలు శిక్ష విధించారు. సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ ఆరుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా, మిగతా ఐదుగురికి రూ.6వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరు యువకుల దుర్మరణం


మురళి (ఫైల్)


మచ్చగిరి (ఫైల్)

మునుగోడు: బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన శుక్రవారం మునుగోడు మండలంలోని ఊకొండి గ్రామ శివారులో చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మర్రి మురళి (21), బింగి మచ్చగిరి(20) ఇరువురు స్నేహితులు. మురళి హైదరాబాద్‌లోని ఓ దుకాణంలో పనిచేస్తున్నాడు. గ్రామానికి చెందిన అతడి స్నేహితుడు వివాహానికి వచ్చాడు. తిరిగి హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉండగా చిట్యాలలోని పౌల్ట్రీ ఫామ్‌లో పనిచేస్తున్న అతడి స్నేహితుడు మచ్చగిరితో కలిసి చిట్యాల వరకు బైక్‌పై వెళ్లి, అక్కడి నుంచి బస్సులో వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈక్రమంలో ఊకొండి నుంచి ఇద్దరు కలిసి బైక్‌పై సాయంత్రం సమయంలో బయలుదేరారు. గ్రామ శివారులోని సెల్‌టవర్ సమీపంలోని మూలమలుపు వద్ద విద్యుత్‌స్తంభానికి బైక్ బలంగా ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న మునుగోడు ఎస్సై రవి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చేతికి వచ్చిన కుమారులు అర్ధాంతరంగా మృతి చెందడంతో వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ఐదు టిప్పర్లు సీజ్

కోదాదరూరల్ : అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న ఐదు టిప్పర్లను, మట్టి తవ్వుతున్న జేసీబీని మైనింగ్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. కోదాడ మండలం కూచిపూడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 633లో అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నారనే సమాచారం మేరకు మైనింగ్ అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది తనిఖీ నిర్వహించారు. మట్టి తవ్వుతున్న జేసీబీతో పాటు ఐదు టిప్పర్లను సీజ్ చేసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 615లో జనవరి 16 నుంచి ఫిబ్రవరి 4వరకు మట్టి తవ్వేందుకు అనుమతి తీసుకొని దానిని జూన్ 4వరకు గడువు ఉన్నట్లుగా ఫోర్జరీ చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఈమేరకు వానికి జరిమానా విధించనున్నట్లు మైనింగ్ ఏడీ విజయరామరాజు, ఆర్ఐ జగదీష్ తెలిపారు.

జూదరుల అరెస్ట్

త్రిపురారం : త్రిపురారం గ్రామ శివారులోని పంట పొలాల్లో గుట్టుచప్పుడు కాకుండా జూదం ఆడుతున్న వారిపై శుక్రవారం త్రిపురారం పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. మరో ఐదుగురు పరారయ్యారు. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని పొలాల్లో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఆకస్మికంగా దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మరో ఐదుగురు పారిపోయినట్లు పేర్కొన్నారు. వీరి నుంచి రూ.7200 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రజతోత్సవ సభకు ఇలా వెళ్లొద్దాం..

బీఆర్ఎస్ పాతికేళ్ల వేడుకల సభకు ఏర్పాట్లు పూర్తి

159 ఎకరాల్లో వేదిక, సభాస్థలం.. ● జనం కోసం సకల వసతులు

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పాతికేళ్ల వేడుకలకు వేళయింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో ఆదివారం అంగరంగ వైభవంగా ఉద్యమ పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించేందుకు వేదిక సిద్ధమైంది. తెలంగాణ అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల కోసం భారీగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఐదు రూట్లలో వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. వేడుకలకు ఆ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. వేదిక ముందు లక్ష కుర్చీలు, మిగతా జనం కోసం షామియానాలు ఏర్పాటు చేశారు.

– సాక్షిప్రతినిధి, వరంగల్





హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో సిద్ధమైన సభా వేదిక

జోన్-1 వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్, వరంగల్ ఈస్ట్, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి, ములుగు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లందు
రూట్ : మల్లంపల్లి–గుడెప్పాడ్ –వంగపహాడ్– యూ టర్న్ ఎన్‌హెచ్ 163–హసన్‌పర్తి –ఎల్కతుర్తి

జోన్-2 ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ నియోజకవర్గాలు, ఇల్లందు, వైరా, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర
రూట్ : ఖమ్మంనుంచి వచ్చే వారు మామునూరు–నాయుడు పెట్రోల్ పంప్–టయోటా షోరూం–కడిపికొండ బ్రిడ్జి–మడికొండ–ఎన్‌హెచ్ 163 బైపాస్ రోడ్డు –టోల్‌గేట్–దేవన్నపేట–మడిపల్లి–అనంతసాగర్, కరుణాపురం –ఎన్‌హెచ్ 163 బైపాస్ టోల్‌గేట్–దేవన్నపేట –మడిపల్లి–అనంతసాగర్–పార్కింగ్

జోన్-3 జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్
రూట్ : ధర్మసాగర్–దేవునూరు –దామెర–చింతలపల్లి–పార్కింగ్

జోన్-4 ఉమ్మడి కరీంనగర్ నియోజకవర్గాలు, చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, పరకాల (కొంతభాగం)
రూట్ : కరీంనగర్, హుజూరాబాద్–కోతులనడుమ–గ్రానైట్ రోడ్డు పార్కింగ్

జోన్-5 ఉమ్మడి మెదక్, నిజామాబాద్ నియోజకవర్గాలు, నిర్మల్, ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్
రూట్ : సిద్దిపేట–ముల్కనూరు–ఇందిరా నగర్ పార్కింగ్

సభ వివరాలు



మొత్తం సేకరించిన భూమి : 1,356 ఎకరాలు

సభావేదిక : 159 ఎకరాలు

- సభకు హాజరయ్యే వారి కోసం 10 లక్షల వాటర్ బాటిళ్లు, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు.
- వెయ్యికి పైగా వైద్య బృందాలు, 20 అంబులెన్స్‌లు సేవలందిస్తాయి.
- నిరంతర కరెంటుకు 200 జనరేటర్ల ఏర్పాటు.

నీటిసంపులో పడి బాలుడు మృతి


సతీష్ (ఫైల్)

చింతపల్లి: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చింతపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గండికోట మురళి– సరస్వతిలకు కుమారుడు గండికోట సతీష్ ఉన్నాడు. శుక్రవారం ఉదయం తల్లిదండ్రులిద్దరూ వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో సతీష్ ఇంటి వద్దే ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటి సంపులో జారి పడ్డాడు. వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు తమ కుమారుడి కోసం వెతికారు. సతీష్ నీటి సంపులో విగతజీవుడిగా పడి ఉన్నాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరై విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి : ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. అనుముల మండలానికి చెందిన వంగాల లవయ్య (48) ద్విచక్రవాహనంపై దేవరకొండలో జరిగిన శుభకార్యానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిలుకలూరిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో లవయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య వంగాల మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

బోరు మోటార్ల చోరీ నిందితుల అరెస్ట్

- 24 బోరు మోటార్లు, రెండు బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శివరాంరెడ్డి


చోరీకి గురైన బోరు మోటార్లను చూపుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నార్కట్‌పల్లి : వ్యవసాయ మోటార్ల చోరీకి పాల్పడుతున్న ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం డీఎస్పీ శివరాంరెడ్డి నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 9న రాత్రి సమయంలో షాపల్లి గ్రామంలోని కన్నెబోయిన శ్రీను వ్యవసాయ బోరు మోటారు చోరీకి గురైంది. ఈమేరకు బాధితుడు నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదే గ్రామానికి చెందిన మాగి నాగరాజుపై అనుమానం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం పక్క సమాచారంతో మండల కేంద్రంలోని అమ్మనబోలు రోడ్డు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు బైక్‌లపై అనుమానాస్పదంగా ఉన్న నలుగురిలో మాగి నాగరాజు ఉండడంతో అతడిని పట్టుకుని విచారించారు. గత రెండు సంవత్సరాల నుంచి మరో ఐదుగురు స్నేహితులతో కలిసి షాపల్లి, తొండల్‌వాయి, నక్కలపల్లి, కట్టంగూర్ మండలంలోని ఈదులూరు, నారెగూడెం, వివిధ గ్రామాల్లో వ్యవసాయ భూముల వద్ద బోరుమోటార్లు చోరీ చేసినట్లు అంగీకరించాడు. దీంతో వారిని విచారించి నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరి నుంచి రూ.9.60 లక్షల విలువైన 24 బోరు మోటార్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో నార్కట్‌పల్లి మండలం షాపల్లి గ్రామానికి చెందిన మాగి నాగరాజు (ఎ–1), సుద్దాల నర్సింహ(ఎ–2), బకరం శేఖర్(ఎ–3), బాషపాక సైదులు(ఎ–4), నల్లమాద లింగయ్య(ఎ–5), బాషపాక లింగయ్య(ఎ–6)గా ఉన్నారని పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వీరంతా ఉదయం ఎక్కడెక్కడ బోరు మోటార్లు ఉన్నాయని రెక్కీ నిర్వహించి, రాత్రి సమయంలో చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



డిండి: మండల కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన శుక్రవారం డిండి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ప్రహరీ వద్ద ఉన్న చెట్లపొదల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని పీహెచ్‌సీ సిబ్బంది, చుట్టు పక్కల ప్రజలు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి వయసు దాదాపు 50 సంవత్సరాల వరకు ఉంటుందని, గోధుమ రంగు షర్ట్, బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కృష్ణ తెలిపారు. తెలిసిన వారు 8712675544, 8712670223 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

జైలును పరిశుభ్రంగా ఉంచాలి


జస్టిస్ షమీమ్ అక్తర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి


జిల్లా జైలును పరిశీలిస్తున్న మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్

- ఖైదీలకు వసతులు కల్పించాలి
- మానవ హక్కుల కమిషన్ చైర్మన్
- నల్లగొండ జిల్లా జైలును సందర్శించిన జస్టిస్ షమీమ్‌అక్తర్

నల్లగొండ : ఖైదీలకు వసతులు కల్పించడంతోపాటు జైలును పరిశుభ్రంగా ఉంచాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్, జస్టిస్ షమీం అక్తర్ సూచించారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని జైలును ఆయన సందర్శించారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆయనకు పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జైలులోని వంటగదిని, ఖైదీలకు పెట్టే ఆహార పదార్థాలను జస్టిస్ షమీం అక్తర్ పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల వివరాలు, సౌకర్యాలు, ఏర్పాట్లు తదితర వివరాలను జైలు సూపరింటెండెంట్ ప్రమోద్ వివరించారు. అదేవిధంగా జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, ప్రభుత్వ ఆస్పత్రులు, సంక్షేమ హాస్టళ్ల ద్వారా అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలు బయట మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. జిల్లా జైలులో సుమారు 177 మంది ఖైదీలు ఉన్నారని, అందులో 21 మంది మహిళా ఖైదీలు ఉన్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం జైలును నిర్వహిస్తుండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జైలర్ బాలకృష్ణ, నల్లగొండ ఆర్డీఓ అశోక్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమేష్, డీఎస్పీ శివరామిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌లు ఉన్నారు.

టైర్ల షాపులో అగ్నిప్రమాదం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మిర్యాలగూడ అర్బన్: ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి టైర్ రీ ట్రేడింగ్ వర్క్ షాపు పూర్తిగా దగ్ధమైన సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేటలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు మచ్చ శ్రీనివాస్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ విజయలక్ష్మి టైర్ రీ ట్రేడింగ్ వర్క్ షాపు లోపలి నుంచి పొగలు వస్తుండటాన్ని గుర్తించిన స్థానికులు షాపు యజమాని మచ్చ శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. షాపు వద్దకు వచ్చిన శ్రీనివాస్ తాళం తీసి చూడగా అప్పటికే టైర్లకు మంటలు అంటుకున్నాయి. దట్టమైన పొగ వ్యాపించింది. విషయం తెలుసుకున్న ఫైర్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మూడు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ సంఘటనలో వందకు పైగా రీ బాటమ్ చేసిన టైర్లు దగ్ధం కాగా వర్క్ షాపులోని మిగతా సామగ్రి మొత్తం పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో మొత్తం రూ.16 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపాడు. షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

అంతర్జాతీయ స్థాయికి తూర్పుగూడెం వాసి

- నిరుపేద కుటుంబంలో జన్మించి శాస్త్రవేత్తగా ఎదిగిన తల్లాడ భాస్కర్
- సీఎస్ఐఆర్– ఏఎంపీఆర్ఐ డైరెక్టర్‌గా నియామకం
- సూర్యాపేటలోనే ప్రాథమిక, ఇంటర్మీడియట్ విద్యాభ్యాసం



తుంగతుర్తి : లక్ష్యాన్ని చేరుకోవాలనే తపన ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు ఓ మారుమూల ప్రాంత వాసి. నిరుపేద కుటుంబంలో పుట్టి అంతర్జాతీయ స్థాయి వరకూ చేరుకున్నాడు. తుంగతుర్తి మండలం తూర్పుగూడెం గ్రామానికి చెందిన తల్లాడ రామకోటయ్య, కమలమ్మ దంపతుల కుమారుడు తల్లాడ భాస్కర్ భోపాల్ లోని సీఎస్ఐఆర్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ ప్రాసెస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎస్ఐఆర్– ఏఎంపీఆర్ఐ) డైరెక్టర్‌గా నియామకమయ్యారు. ప్రస్తుతం ఆయన సీఎస్ఐఆర్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం సీఎస్ఐఆర్ – ఐఐపీ డెహ్రాడూన్‌లో చీఫ్ సైంటిస్ట్‌గా, మెటీరియల్స్ రిసోర్స్ ఎఫిషియెన్సీ డివిజన్ హెడ్‌గా పని చేస్తున్నారు.

ప్రపంచంలోని టాప్ 2 శాస్త్రవేత్తల్లో ఒకరుగా..

తల్లాడ భాస్కర్ నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికీ మొదటి నుంచి చదువులో రాణిస్తూ ఉండేవారు. సంవత్సరం క్రితం భాస్కర్ తల్లిదండ్రులిద్దరూ మృతి చెందారు. ప్రస్తుతం ఆయనకు గ్రామంలో ఇంటి స్థలం కూడా లేదు. ప్రాథమిక విద్య తూర్పు గూడెంలో, ఆరు, ఏడవ తరగతి గుమ్మడవెల్లిలో, 8, 9వ తరగతి తుంగతుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో, పదో తరగతి సూర్యాపేట జెడ్పీ బాలుర పాఠశాలలో 1986–87 లో ఇంటర్మీడియట్ సూర్యాపేటలో చదివారు. నాడు తుంగతుర్తి, గుమ్మడవెల్లి గ్రామాలకు రవాణా సౌకర్యాలు లేకపోవడంతో నిత్యం ఆరు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి తన విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్ (2022– 2024)ప్రకారం ఆయన ఎనర్జీ రంగంలో ప్రపంచంలోని టాప్ 2 శాస్త్రవేత్తల్లో ఒకరుగా నిలిచారు.

చదువే ప్రధానం : డాక్టర్ తల్లాడ భాస్కర్

చదువుకుంటేనే ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు. నా చిన్నతనంలో మా కుటుంబ పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఆర్థికంగా ఉన్న కుటుంబం కాదు. నేను చదువుకొని ముందుకు వెళ్తే ఏదో ఒకటి లభిస్తుందని ఉన్నతంగా చదువుతున్నా.

మూడు గడ్డివాములు దగ్ధం

కోదాదరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో మూడు గడ్డివాములు శుక్రవారం ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన పాడి రైతులు సట్టు కేశవులు, సట్టు శ్రీను, సట్టు సుధాకర్‌లు తమ ఇంటి సమీపంలో గల కట్టపై గడ్డివాములు వేసుకున్నారు. ప్రమాదవశాత్తు ఓ గడ్డివాముకు నిప్పు అంటుకొని గాలివాటానికి పక్కనే ఉన్న మరో రెండు వాములకు కూడా మంటలు అంటుకోవడంతో 750 మోపుల గడ్డి అగ్నికి ఆహుతి అయింది.

లోక రక్షణార్థమే ఏసుక్రీస్తు జననం

- విజయవాడ మేత్రాసన పీఠాధిపతి జోసెఫ్ రాజారావు

మఠంపల్లి: లోక రక్షణార్థమే ఏసుక్రీస్తు అవనిపై అవతరించాడని విజయవాడ మేత్రాసన పీఠాధిపతి జోసెఫ్ రాజారావు తెలగతోటి అన్నారు. శుక్రవారం మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త చర్చి వార్షికోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా క్రైస్తవులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం చర్చిలో దివ్యబలిపూజలో పాల్గొన్న బిషప్ క్రైస్తవులకు దివ్య సందేశమిచ్చారు. దివ్యబలిపూజకు రెండు రాష్ట్రాలకు చెందిన విచారణ గురువులు, సిస్టర్స్, బ్రదర్స్ హాజరయ్యారు. భక్త బృందం ఆలపించిన గేయాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం మేరీమాత ప్రతిమను తేరుపై పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో విచారణ గురువులు మార్టిన్ పసల, అల్లంబాల, చిన్నయ్య, బాలశౌరీ, రాజేష్, అరుణ్‌రాజు, జనార్దన్‌రెడ్డి, సాగర్, చర్చి కమిటీ సభ్యులు బాలరెడ్డి, ఆంథోని రెడ్డి, జయభారత్‌రెడ్డి, ఆంథోని, గాలి చిన్నపురెడ్డి, బాలశౌరెడ్డి, బోనగిరి ప్రకాష్‌బాబు, థామస్‌రెడ్డి, కాకుమాను జోసెఫ్, దైదారాయలు తదితరులు పాల్గొన్నారు.


దివ్యబలిపూజ నిర్వహిస్తున్న బిషప్ జోసెఫ్ రాజారావు


ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు